# కాంగ్రెస్‌కే గ్యారెంటీ లేదు

- వాళ్లొస్తే మళ్లీ అంధకారమే • ఆరు హామీలను నమ్మి మోసపోవద్దు
- కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం • పార్టీ శ్రేణులు గడపగడపకూ వెళ్లి వివరించాలి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- పలు గ్రామాల్లో మహిళలు, నాయకులతో మాటామంతి



**కోనరావుపేట: మామిడిపల్లి గ్రామంలో స్థానిక నాయకులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, పక్కన జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ**

కోనరావుపేట, నవంబర్ 27: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే గ్యారెంటీ లేదని, వాళ్లు ఇచ్చే హామీలను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన కొలనూర్, ధర్మారం, మల్కపేట, నిజామాబాద్, మామిడిపల్లి, బావుసాయిపేట గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి మహిళలు, నాయకులతో కలిసి ముచ్చటించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పుడు హామీలతో ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను వివరించాలన్నారు. పథకాలు మళ్లీ అమలు కావాలంటే కారు గుర్తుకు ఓటేయాలని సూచించారు. కాంగ్రెస్ అరవై ఏండ్ల పాలనలో కరెంటు, సాగు, తాగునీటి కోసం పడిన కష్టాలను ప్రజలకు గుర్తు చేయాలన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ అంధకారమే తప్ప ఒరిగేదేమి లేదన్నారు. ప్రతి ఇంటా మళ్లీ టార్చ్‌లైట్లు కొనుక్కోవాల్సి వస్తుందని గుర్తు చేశారు. ఇదంతా ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావును భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అందుకోసం నాయకులు, కార్యకర్తలు రాబోయే రెండు రోజులు విశేష కృషి చేయాలని సూచించారు. అనంతరం నిజామాబాద్ గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడి ఇటీవల ఈర్ల బాబు మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అన్నివిధాలా అండగా ఉంటామని బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎంపీపీ చంద్రయ్యగౌడ్, మార్కెఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య, సింగిల్ విండో చైర్మన్ రామ్మోహన్‌రావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సర్పంచులు మంతెన సంతోష్, ఆరె లత, కొక్కుల భారత, తుమ్మల యమున, కెంద గంగాధర్, వైస్ ఎంపీపీ సుమలత, సీనియర్ నాయకుడు న్యాలకొండ రాఘవరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### చిన్నారితో అప్యాయంగా..

మామిడిపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పర్యటించారు. ఈ క్రమంలో పార్టీ కార్యాలయం వద్ద చిన్నారి తీపిరెడ్డి విచిత రెడ్డి గులాబీ టోపీ, కండువాతో కనిపించింది. ఆ చిన్నారితో వినోద్‌కుమార్ ముచ్చటించగా, చిట్టిపొట్టి మాటలతో సమాధానం చెప్పింది. అక్కడ ఉన్నవారంతా ఆ చిన్నారిని చూసి మురిసిపోయారు.

## ఒక్క ఓటూ మిస్‌కావొద్దు

- బూత్‌ల వారీగా బీఆర్‌ఎస్ శ్రేణులతో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ సమీక్ష

చందుర్తి, నవంబర్ 27: ఒక్క ఓటు మిస్‌కావొద్దని, ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చి బీఆర్‌ఎస్‌కే ఓటు వేసేలా చైతన్యపర్చాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన మర్రిగడ్డ, బండపల్లి, మూడపెల్లి, ఎన్గల్ గ్రామాల్లో బూత్‌ల వారీగా బీఆర్‌ఎస్ శ్రేణులతో సమీక్షించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పనులను ఓటర్లకు వివరించాలన్నారు. సామాజిక వర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి, నిధుల విడుదలతో గ్రామంలో వచ్చిన మార్పులను వివరిస్తూ ఓటు అభ్యర్థించాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు అన్యాయం జరిగిందని, కరువు కాటకాలే అందుకు నిదర్శనమని వివరించాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఎంతో చేసిందని, ఇంకా చేయాల్సి ఉందని ప్రజలు తమ వెన్నంటే నిలువాలని కోరారు. ఈనెల 30న జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కుతో బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు తెలుపాలన్నారు. ఇక్కడ జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, నాయకులు దారం బాల్‌రెడ్డి, జువ్వాడి అనిల్‌రావు, సంటి బాబురావు, కొండా లక్ష్మణ్, లింగంపల్లి బాబు, సర్పంచ్ లింగంపల్లి సత్తయ్య, గంగాధర్, కిషన్, రవి లక్ష్మణ్ పాల్గొన్నారు.



**అనంతగిరి గ్రామంలో పర్యటిస్తున్న మానకొండూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**

## బీఆర్‌ఎస్‌తోనే ప్రగతి

- కాంగ్రెస్‌కు అవకాశమిస్తే అభివృద్ధి కుంటుపడుతది
- మానకొండూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

ఇల్లంతకుంట, నవంబర్ 27: బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని మానకొండూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంతోపాటు అనంతగిరి, సిరికొండ, తెనుగువానిపల్లి గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ, 55 ఏండ్లలో కాంగ్రెస్ చేయలేని అభివృద్ధిని, స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ గత పదేండ్లలో చేసి చూపిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో వ్యవసాయానికి 24గంటల కరెంటు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. కేవలం తెలంగాణలో అధికారం కోసం మాత్రమే కాంగ్రెస్ నాయకులు ఆరాటపడుతున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీ రైతులకు సాగునీరు, 24గంటల విద్యుత్ అందించి అండగా నిలిచిందని కొనియాడారు. మరోసారి అవకాశం ఇస్తే ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించగా, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మండల కేంద్రంలో బతుకమ్మలు, బోనాలతో ర్యాలీ తీసి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ సుధగోని శ్రీనాథ్‌గౌడ్, సర్పంచులు కూనబోయిన భాగ్యలక్ష్మి, నీలం లక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, గొట్టెపర్తి పరశురాం, ఉప సర్పంచులు బాలకిషన్, సాదుల్, నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆకర్షితులై..

- బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవదాస్
- గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు




**బీఆర్‌ఎస్‌లో చేరిన దేవదాసుకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు**

గంభీరావుపేట, నవంబర్ 27: ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో గత తొమ్మిదిన్నర ఏళ్లుగా జరగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆయా పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరతున్నారని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. దేశాయిపేటలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమానికి కొండూరి హాజరయ్యారు. జిల్లా బీసీ సెల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దేవదాస్‌తోపాటు 30 మంది మహిళలు బీఆర్‌ఎస్‌లో చేరగా, కొండూరి వారికి గులాబీ కండువా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదల సంక్షేమమే లక్ష్యంగా మంత్రి కేటీఆర్ చేసిన అభివృద్ధికి ఆకర్షితులై ఆయా పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో పార్టీలో చేరడం సంతోషకరమన్నారు. మన ప్రాంతంలో అభివృద్ధి కొనసాగాలంటే మంత్రి కేటీఆర్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అబద్ధపు మాటలు చెబుతున్న వారిని నమ్మవద్దని, మీ కళ్ల ముందు జరిగిన అభివృద్ధిని చూసి అమాత్యుడు రామన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, సర్పంచ్ కూడెల్లి చంద్రకళ, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రాజేందర్, నాయకులు కొమిరిశెట్టి లక్ష్మణ్, జక్కుల నర్సింహులు, రాజయ్య, దేవదాస్, అభిలాష్, కిషన్‌రావు, ఎల్లయ్య, కిష్టయ్య, రాజయ్య, రాజు, రమాదేవి, గంగారాం, శ్యామల, శంకరవ్వ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు • ఆలయంలో పూజలు

## కనులపండువగా జ్వాలాతోరణం




**దేదీప్యమానంగా వెలుగొందుతున్న జ్వాలాతోరణం కింద నుంచి దర్శనం చేసుకుంటున్న భక్తులు**

వేములవాడ టౌన్, నవంబర్ 27: కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం రాత్రి రాజన్న ఆలయంలో జ్వాలాతోరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకుల వేదమంత్రాలమధ్య కనుల పండువగా నిర్వహించారు. ఈ జ్వాలాతోరణం ఆద్యంతం భక్తులను తన్మయత్వంలో ముంచివేసింది. కార్తీక మాసం ప్రారంభం నుంచిశివాలయాల్లో కార్తీకదీపాలు వెలిగించడం అనాదిగా వస్తున్న ఆచారం. అందులో భాగంగానే రాజన్న ఆలయ స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు జ్వాలాతోరణానికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్తీకమాసంలో అగ్నిదేవతలను సంతోషపెట్టడం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని పురాణాలు చెబుతున్నాయి. కృత్తికా నక్షత్రంలోని కార్తీక పౌర్ణమి రోజున అగ్నిదేవతలను సంతోషపరచడం కోసం ఇలాంటి జ్వాలా తోరణ కార్యక్రమాలు నిర్వహిస్తామని పండితులు పేర్కొన్నారు.

## అభివృద్ధి చేసే నాయకుడికి అండగా ఉండాలి

- మంత్రి కేటీఆర్‌కు భారీ మెజార్టీ ఇవ్వాలి • సీఎం సోదరి వినోద

ముస్తాబాద్, నవంబర్ 27: తొమ్మిదిన్నర ఏండ్లలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను చేసి పని చేసే నాయకుడు కేసీఆర్‌కు అందరూ అండగా ఉండాలని, మంత్రి కేటీఆర్‌కు భారీ మెజార్టీ ఇవ్వాలని సీఎం కేసీఆర్ సోదరి వినోద కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పోతుగల్ గ్రామంలోని తన నివాసంలో సోమవారం యువతతో మాట్లాడారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. అలాగే జిల్లా ప్రగతి ప్రదాత కేటీఆర్‌కు భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతున్న కాంగ్రెస్ నాయకులను నమ్మి మోసపోవద్దన్నారు. ఇక్కడ బీఆర్‌ఎస్ నేతలు కోల కృష్ణ, సతీశ్, కనకయ్య, కిట్టు, సందేవ్, రాకేశ్, చింటు, సోషల్ మీడియా వారియర్ నాని, పారిపెల్లి శ్రీనివాస్, విశ్వనాథం, గీస శంకర్, బాల్‌నర్స ఉన్నారు.



**మంత్రి కేటీఆర్‌కు భారీ మెజార్టీ ఇవ్వాలని యువతను కోరుతున్న సీఎం సోదరి వినోద**